

# నీలికళ్ళు

## అక్టేవియో పాజ్

అనువాదం
ముక్తవరం పార్థసారథి

చెమటపట్టి దిగ్గున లేచి కూర్చున్నాను. స్నానం చేసినట్టుగా ఒళ్లంతా ధారలు కారిపోతున్నాయి. ఎర్రటి యిటుకలు పరచిన పేవ్‌మెంట్ ఆవిర్లు చిమ్ముతున్నది. బూడిదరంగు సీతాకోక చిలుక మిరుమిట్లు గొల్పుతున్న పచ్చటి లైటు చుట్టూ పరిభ్రమిస్తున్నది. చెట్టుకు కట్టిన వూయల వలలా తోచింది. కిందికి దూకి నగ్నపాదాలతో గదివైపు పరిగెత్తాను. చల్లటి గడ్డిలో విహరిస్తున్న తేళ్లను నలిపేస్తానని భయం. కిటికీ దగ్గర నిల్చున్నాను. చెట్లమీదుగా వచ్చిన స్వచ్ఛమైన గాలి పలకరించింది. రాత్రి కన్య గుండెల నిండా వూపిరి తీసుకుంటున్న సవ్వడి వినగలుగుతున్నాను. జగ్గులోంచి నీళ్లు వంపి తువ్వాలుతో ఒళ్లంతా తుడుచుకున్నాను. గుడ్డల మడతల్లో చిన్నచిన్న కీటకాలు విశ్రాంతి తీసుకునే ప్రమాదమూ లేకపోలేదు. డ్రెస్ చేసుకుని మెట్లు దిగాను. ఇంటి యజమాని ఎదురుపడ్డాడు. అతడికి పలుకే బంగారం. మనం రెండు కళ్లతో చూసే లోకాన్ని అతడు ఒంటికంటితో చూస్తాడు. అల్లిన కేను స్టూలు మీద కూర్చుని చుట్ట కాలుస్తున్నాడు – కన్ను అర మూసుకుని.

''ఎక్కడికి?'' బొంగురు గొంతు వాకబు చేసింది.

''ఉక్కగా వుంది. కాస్త అలా నడిచి వస్తాను''.

''దుకాణాలు మూసేశారు. వీధిలైట్లు కూడా లేవు. ఇంట్లో వున్నంత క్షేమం లేదు.''

''త్వరగా వస్తాను'' అంటూ బయటకు పరుగెత్తాను – చీకటి దారులలో స్వేచ్ఛను వెదుక్కుంటూ.

కళ్లు పొడుచుకున్నా ఏమీ కనిపించదు. ఎగుడుదిగుడు దారిలో రాళ్లూ, రప్పలూ. సిగరెట్టు వెలిగించాను.

నల్లని మబ్బు వెనక చంద్రుడు కనిపించి ఆశ్చర్యపరిచాడు. పెచ్చులూడిన తెల్లటి గోడమీద వెన్నెల మెరిసింది. ఆ వెలుగుకు కళ్లు మూతలుపడ్డాయి. గాలి ఈల వేసింది. చింతచెట్ల వాసన ముక్కు పుటాలను ఉత్తేజపరిచింది. ఆకుల కదలిక, కీటకాల కిచకిచలతో రాత్రి గానం ప్రారంభమైంది. మిడతలూ, గొల్లభామలూ గడ్డిపోచల మీద నాట్యం చేశాయి. తలెత్తి చూశాను. ఆకాశంలో చుక్కలు కూడా సభ చేస్తున్నాయి. సైగల భాషలో మాత్రమే అర్థం చేసుకోగల మీ అనంత విశ్వాసాన్ని. బృహద్రూపాల జీవులు సంకేతాలలో

మాత్రమే సంభాషించుకుంటారు. నా నడక, గొల్లభామల వయ్యారి కులుకు, నక్షత్రాల అరమోడ్పు కాంతులు – ఇదంతా ఒక వింత భాష. అర్థంకాని పదాల వెనక దాగిన రహస్యాలు. నిశ్శబ్దం కూడా ఒక పలకరింపే. ఈ ప్రకృతి పలుకులలో ఒంటరి అక్షరాన్ని నేను. కాని దీన్ని వుచ్చరిస్తున్నదెవరు? ఎవరితో మాట్లాడుతున్నారు? సిగరెట్ విసిరేశాను. నిప్పుకణిక వంకరగా ప్రయాణించి, తోకచుక్కలా మిణుగుర్లు చిమ్ముతూ ఆరిపోయింది.

నెమ్మదిగా, చాలాసేపు నడిచాను. మాట్లాడుతున్న పెదవులు నాకు స్వేచ్ఛ ప్రసాదిస్తున్నాయి. ఇదే ఆనందం. కళ్లు విచ్చిన పూదోట ఈ రాత్రి. రోడ్డు దాటుతుంటే ఎవరో తలుపుతీసిన చప్పుడు. వెనక్కు తిరిగి చూశాను. ఎవరూ లేరు. వడివడిగా ముందుకు కదిలాను. వెనకనుండి, నెమ్మదిగా, అతినెమ్మదిగా, రాతిబండల మీద బూట్ల చప్పుడు వినిపించింది. తలతిప్పి చూడటమెందుకు! అడుగడుక్కీ నీడ నన్ను సమీపించింది. పరిగెత్తాలనుకున్నాను. కళ్లు ముందుకు కదల్లేదు. ఆత్మరక్షణకు అవకాశం కూడా లేదు. వీపులో బాకు మొన గుచ్చుకున్నది. మంద్ర స్వరంతో, ఎవరో –

"కదలొద్దు, మిస్టర్, బాకు దిగుతుంది" అన్నారు అనునయంగా.

"ఏం కావాలి?"

"నీ కళ్లు" – అతిమెత్తని గొంతు. బాధ నిండిన గొంతు.

"నా కళ్లా? కళ్లేం చేసుకుంటావు? జేబులో డబ్బుంది తీసుకో. ఎక్కువ లేదనుకో. అయినా వున్నదంతా యిచ్చేస్తాను. నన్ను చంపొద్దు."

"భయపడకు. చంపను. నీ కళ్లు మాత్రమే కావాలి."

"కళ్లెందుకయ్యా బాబూ?"

"నా ప్రియురాలి కోరిక. నీలికళ్లు ఆమెకు కానుకగా యివ్వాలట. ఎంత వెదికినా నీలికళ్లు దొరకలేదింతవరకూ –"

"నావి గోధుమరంగు కళ్లు. నీకుపయోగించవు."

"నన్ను మోసం చెయ్యలేవు మిస్టర్. నీవి నీలికళ్లని నాకు బాగా తెలుసు."

"సాటి మనిషి కళ్లిలా పెరుకుతావయ్యా బాబూ. అవి తప్ప మరేమైనా తీసుకో."

"మాటలు కట్టిపెట్టి వెనక్కు తిరుగు."

తిరిగాను. అతడు సన్నగా, బలహీనంగా వున్నాడు.

సగం మొహంమీద ముసుగు కప్పుకున్నాడు. కుడిచేతిలోని కసాయి కత్తి వెన్నెల్లో మెరిసింది.

"ఏదీ, ఒకసారి నీ మొహం చూడనీ."

అగ్గిపుల్ల గీసి మొహం చూపాను. వెలుగుతో కళ్లు మూసుకుపోయాయి. నా కనురెప్పలు తెరిచి చూశాడు. సరిగా కనిపించలేదమో, మునివేళ్ల మీద నిల్చుని, కళ్లలో కళ్లుపెట్టి పరిశీలించాడు. జ్వాలతో కనుబొమలు కాలిపోతాయనిపించింది. మంటకు వేళ్లు చురుక్కుమన్నాయి. అగ్గిపుల్ల పారేశాను. నిశ్శబ్దం.

"ఇప్పటికైనా నమ్ముతావా? నావి నీలికళ్లు కావు."

"మరోసారి చూడనీ. అగ్గిపుల్ల వెలిగించు."

కాలర్ పట్టి లాగి, కళ్లు పరీక్షించాడు.

"కాస్త వంగు."

నా జుత్తు పట్టుకుని, తలకాయ వెనక్కు వంచి మరీ చూశాడు. కసాయి కత్తి నేలకు జారింది. భయంతో కళ్లు మూసుకున్నాను.

"మూసుకోవద్దు. కళ్లు తెరు."

మంటకు ఈసారి కనురెప్పలంటుకున్నాయి. నొప్పి – బాధ.

'ఛీ!' అంటూ నన్నొదిలేశాడు.

"నీలికళ్లు కావులే. వెళ్లిపో." అంటూ అదృశ్యమయ్యాడు. తల పట్టుకుని, గోడకు వాలి నిల్చున్నాను. తూలి పడబోయాను.

నిర్మానుష్యమైన వీధుల్లో ఆగకుండా గంటసేపు పరిగెత్తాను. తిరిగితిరిగి చివరికి యిల్లు చేరుకున్నాను. యజమాని యింకా తలుపు దగ్గరే కూర్చున్నాడు. మౌనంగా లోపలికెళ్లాను. ఆ మరునాడు వూరు వదిలి వచ్చాను. ★

"ఏం కావాలి?"
"నీ కళ్లు" – అతిమెత్తని గొంతు. బాధ నిండిన గొంతు.
"నా కళ్లా? కళ్లేం చేసుకుంటావు? జేబులో డబ్బుంది తీసుకో. ఎక్కువ లేదనుకో. అయినా వున్నదంతా యిచ్చేస్తాను. నన్ను చంపొద్దు.
"భయపడకు. చంపను. నీ కళ్లు మాత్రమే కావాలి."
"కళ్లెందుకయ్యా బాబూ?"
"నా ప్రియురాలి కోరిక. నీలికళ్లు ఆమెకు కానుకగా యివ్వాలట. ఎంత వెదికినా నీలికళ్లు దొరకలేదింతవరకూ –"



## ఆక్టేవియోపాజ్

**(1914-1998)**

ప్రముఖ మెక్సికన్ కవి, రచయిత, దౌత్యవేత్త ఆక్టేవియో పాజ్. లాటిన్ అమెరికన్ సాహిత్యాన్ని ప్రభావితం చేసిన పాబ్లో నెరుడా, సీజర్ వాలెహోలకు సన్నిహితుడు.

పాజ్ తాతగారు నమా రచయిత. తండ్రి ఎమిలియానో, జపాటా వద్ద సెక్రటరీగా పనిచేశాడు. జపాటా పరాజయం, హత్య తర్వాత కుటుంబం అమెరికాకు తరలి వచ్చింది. కొన్నాళ్ల తర్వాత మెక్సికో తిరిగి వెళ్లిన పాజ్ అక్కడి నేషనల్ యూనివర్సిటీలో న్యాయశాస్త్రం, సాహిత్యం చదివాడు గాని డిగ్రీ తీసుకోలేదు. నెరుడా ప్రోత్సాహంతో కవితా ప్రస్థానం ప్రారంభమైంది. తొలి దశలో జర్నలిస్టుగా, సాహిత్య పత్రికల సంపాదకుడిగా కూడా పనిచేశాడు.

సర్రియలిస్ట్ కవి ఆండ్రి బ్రెటన్‌తో సాన్నిహిత్యం ఏర్పడిన 1940లలో అధివాస్తవిక ప్రయోగాలు చేశాడు. ఆంద్రె మాల్రా, ఆండ్రి గైడ్, ఇల్యా ఎహ్రెన్‌బర్గ్‌లతో కలిసి స్పానిష్ విముక్తి పోరాటంలో పాల్గొన్నాడు.

రెండవ ప్రపంచయుద్ధం తర్వాత రష్యాలో జరిగిన సంఘటనలతో స్టాలినిజం పట్ల విముఖత ఏర్పడింది. మెక్సికో ప్రభుత్వ దౌత్యశాఖలో చేరాడు.

"మేధావులు, సాహిత్యకారులు అయిడియాలజీని నమ్మాలి. ప్రత్యక్ష రాజకీయాలు వీళ్ళకి సరిపడవు" అన్నది పాజ్ విశ్వాసం. చివరిదాకా కమ్యూనిస్టుగా జీవించిన నెరుడా, క్యూబన్ విప్లవాన్ని సమర్థించిన గాబ్రియెల్ గార్షియా మార్క్వెజ్‌లతో విభేదించాడు.

దౌత్యవేత్తగా ఆరేళ్లు పారిస్‌లో వున్నకాలంలో, అక్కడి కవులు, మేధావుల సాంగత్యం తోడై అనేక కవితా సంకలనాలు, మెక్సికన్ కళ గురించిన అధ్యయన గ్రంథాలు ప్రచురించాడు.

పాజ్ ప్రధాన రచనలు: 'ఈగల్ ఆర్ సన్' 1951 (కథా సంకలనం); ఎ టేల్ ఆఫ్ టూ గార్డెన్స్ (1952); లేబిరియంత్ ఆఫ్ సాలిట్యూడ్ (1950, 1957); సన్‌స్టోన్ – సూర్యశిల (1957). ప్రేమదేవత – గాడెస్ ఆఫ్ లవ్ గురించిన కవిత యిది.

"నదిలా నీతో ప్రవహిస్తా.
అరణ్యంలా నీలో వ్యాపిస్తా".

జపాన్, అమెరికా, యునెస్కోలలో కూడా పనిచేశాడు పాజ్. 1962 నుంచి మనదేశంలో మెక్సికో రాయబారిగా వున్నాడు. 1968లో మెక్సికోలో జరిగిన ఒక మారణకాండకు నిరసనగా ఉద్యోగానికి రాజీనామా చేసి హిందూ, బౌద్ధ మత సాంస్కృతిక జీవితాన్ని అధ్యయనం చేస్తూ గడిపాడు. 'వైరుధ్యాల కలయికే కవితారూపం'. కవి 'యస్' అన్నా దానర్థం 'నో' అంటాడు పాజ్. జీవిత కాలంలో నలభై గ్రంథాలు ప్రచురించిన పాజ్‌కు 1990లో నోబెల్ బహుమతి లభించింది.